సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 10 । ఆగస్టు । 2024



టన్ను చీనీ రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు పలికాయి. మార్కెట్‌కు 639 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.26

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.26, కనిష్టంగా రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.2°/22.4°

జిల్లా పరిధిలో శుక్రవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

22 మండలాల్లో వాన



పుట్టపర్తి శివారులో కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్: ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ 22 మండలాల పరిధిలో వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా కొత్తచెరువు మండలంలో 39.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక ఓడీ చెరువు 31.2, పెనుకొండ 29.4, బుక్కపట్నం 23.6, ముదిగుబ్బ 23.2 పరిగి 20.2, లేపాక్షి 20, పుట్టపర్తి 18.4, తనకల్లు 18.0, గుడిబండ 16.2, సీకేపల్లి 15.4, ఎన్పీ కుంట 11.2, నల్లమాడ 9.8, ధర్మవరం 6.2, నల్లచెరువు 5.8, హిందూపురం 4.8, బత్తలపల్లి, అమరాపురం, గోరంట్ల, చిలమత్తూరు మండలాల్లో 4.2 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. అలాగే మడకశిర 2.6, రొళ్ల మండలంలో 2.4 మి.మీ మేర వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాకు శనివారం కూడా వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తాజా వర్షాలతో ఎండుముఖం పట్టిన పంటలకు మేలు జరుగుతుందన్నారు.

నిండుకుండలా తుంగభద్ర



పూర్తిస్థాయిలో నిండిన జలాశయం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నీటితో నిండుకుండలా ఉంది. గురువారం 48,439 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో శుక్రవారం సాయంత్రానికి 53.654 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో 5 క్రస్ట్ గేట్లు ఒక్క అడుగు మేర ఎత్తి నది, కాలువలకు కలిపి మొత్తం 22,909 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. 1,633 అడుగులతో 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 1632.93 అడుగులతో 105.507 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్ వద్ద 1,320 కూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

వేళాంగిణి మాత ఉత్సవాలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

గుంతకల్లు: తమిళనాడులో ప్రసిద్ధి గాంచిన వేళాంగిణి మాత ఉత్సవాలకు వెళ్లే భక్తుల కోసం ముంబై ఎల్‌టీటీ– వేళాంగిణి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న ముంబై ఎల్‌టీటీ జంక్షన్ (01161) నుంచి మధ్యాహ్నం 1.00 గంటలకు బయలుదేరి 27వ తేదీ రాత్రి 11.50 గంటలకు వేళాంగిణి రైల్వే స్టేషన్‌కు చేరుతుందన్నారు. తిరిగి ఈ రైలు 28వ తేదీ వేళాంగిణి రైల్వేస్టేషన్ (01162) నుంచి వేకువజామున 3.00 గంటలకు బయలుదేరి 29వ తేదీ సాయంత్రం 4.20 గంటలకు ముంబై ఎల్‌టీటీ జంక్షన్‌కు చేరుతుందన్నారు. అదే విధంగా సెప్టెంబర్ 7వ తేదీ ముంబై ఎల్‌టీటీ జంక్షన్ (01163) నుంచి మధ్యాహ్నం 1.00 గంటకు బయలుదేరి 8వ తేదీ రాత్రి 11.50 గంటలకు వేళాంగిణి రైల్వేస్టేషన్‌కు చేరుతుందని పేర్కొన్నారు. తిరిగి ఈ రైలు సెప్టెంబర్ 9వ తేదీ వేకువజామున 3.00 గంటలకు బయలుదేరి ముంబై ఎల్‌టీటీ జంక్షన్‌కు 10వ తేదీ సాయంత్రం 4.20 గంటలకు ముంబై ఎల్‌టీటీ జంక్షన్ చేరుతుందని తెలిపారు. ఈ రైళ్లు రాయలసీమలోని మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, కడప, రేణిగుంట జంక్షన్ల మీదుగా రాకపోకలు సాగిస్తాయన్నారు. ఏసీ టూటైర్, త్రీటైర్, స్లీపర్ బోగీలు అందుబాటులో ఉంటాయని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బెంగళూరు-కలబురిగి మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బెంగళూరు-కలబురిగి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 14, 16, 17 తేదీల్లో బెంగళూరు జంక్షన్ నుంచి రాత్రి 9.15 గంటలకు (06533) బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.45 గంటలకు కలబురిగి జంక్షన్‌కు చేరుతుందన్నారు. అదేవిధంగా ఈ నెల 15, 17, 18 తేదీల్లో కలబురిగి జంక్షన్ నుంచి ఉదయం 9.30 గంటలకు (06534) బయలుదేరి రాత్రి 8.00 గంటలకు బెంగళూరు జంక్షన్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, యాద్గిరి, షాబాద్‌ల మీదుగా రాకపోకలు సాగిస్తున్నట్లు వెల్లడించారు.

అక్రమాలకు అధికారం అండ

- జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. హిందూపురం ప్రాంతంలో మరింత ఎక్కువగా ఉంది. ట్రాక్టర్ల ద్వారా పక్కనే ఉన్న కర్ణాటకకు తరలించి జేబులు నింపుకుంటున్నారు. ఇందుకోసం కుముద్వతి, చిత్రావతి, పెన్నా నదులను ఎడాపెడా తోడేస్తున్నారు. పట్టపగలే హిందూపురం వీధుల గుండా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. అయినా ఎవరూ అడ్డుచెప్పడం లేదు.
- ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి చుట్టుపక్కల గంజాయి రాజ్యమేలుతోంది. చీకటి పడగానే.. యువత ఒక చోటకు చేరి పెన్నులు, కూల్ డ్రింక్ బాటిళ్లలో నింపుకొని సేవిస్తున్నారు. అడ్డుకట్ట వేసే వారు లేకపోవడంతో 'మత్తు' వ్యాపారం పుట్టపర్తిలో మస్తుగా జరుగుతోంది.
- జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై నిషేధిత గుట్కా విక్రయాలు విపరీతంగా జరుగుతున్నాయి. కియా కార్ల కంపెనీ సమీపంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారి కోసం పక్క రాష్ట్రం కర్ణాటక నుంచి గుట్కా తెచ్చి అమ్ముతున్నారు. చాక్లెట్ పేపరులో చుట్టి విక్రయిస్తున్నట్లు తెలిసింది.
- జిల్లాలో 32 మండలాలు ఉండగా... 16 మండలాలకు కర్ణాటక సరిహద్దు ఉంది. రాత్రింబవళ్లు కర్ణాటక మద్యం సరఫరా అవుతోంది. పోలీసులు బదిలీ బిజీలో ఉండటంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా మద్యం అక్రమ రవాణా చేస్తున్నారు.
- రోజూ రాత్రి వేళల్లో రేషన్ బియ్యం లారీల్లో మామిళ్లపల్లి, చెన్నేకొత్తపల్లి, సోమందేపల్లి, చిలమత్తూరు మీదుగా బెంగళూరుకు తరలుతున్నాయి. ఈ సమాచారం ముందే పోలీసులకు తెలిసినా...ఒక్కో లారీ జిల్లా పరిధిలోని కనీసం ఆరు నుంచి ఏడు పోలీసు స్టేషన్లు దాటి కర్ణాటకకు వెళ్తున్నా ఏ ఒక్కరూ పట్టుకోవడం లేదు.

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- భారీగా కర్ణాటక మద్యం దిగుమతి
- హద్దు దాటిపోతున్న రేషన్ బియ్యం
- 'తమ్ముళ్ల' కనుసన్నల్లోనే అక్రమాలు
- ప్రతి విషయంలో అధికారులపై పెత్తనం
- కేసులు లేకుండా ఎక్కడికక్కడ రాజీ పర్వం



చిలమత్తూరు మండల పరిధిలో చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తోడేస్తున్న దృశ్యం

సాక్షి, పుట్టపర్తి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే 'తెలుగు తమ్ముళ్ల' అక్రమార్జనకు దారులు వెతికారు. అందివచ్చే ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణా, మద్యం సరఫరా, పేకాట, గంజాయి..ఇలా ప్రతి అక్రమాన్నీ ఆర్జనకు మార్గంగా మలుచుకున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే అధికార పార్టీ అంటూ వారిపైనే ఎదురుదాడికి దిగుతున్నారు.



చెన్నేకొత్తపల్లి సమీపంలో గుట్టుగా తరలిపోతున్న రేషన్ బియ్యం



హిందూపురంలో పట్టపగలే ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న దృశ్యం

అక్రమార్కులకు ఖాకీల అండ

జిల్లాలో పేకాట మాత్రమే కాదు.. ప్రతీ దందా 'తెలుగు తమ్ముళ్ల' కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు తెలుస్తోంది. తాము అధికార పార్టీ నేతలమని పోలీసు స్టేషన్లలో రుబాబు చేస్తున్నారు. తమ కట్టడి చేసినా.. కేసులు నమోదు చేసినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అధికారులనే బెదిరిస్తున్నారు. అయినప్పటికీ విధి నిర్వహణలో భాగంగా కొందరు పోలీసులు అడపాదడపా కేసులు నమోదు చేస్తున్నారు. మరికొందరు మాత్రం కమీషన్లు దండుకుని టీడీపీ నేతల అక్రమ దందాలో భాగస్వాములవుతున్నారు. వాస్తవానికి ఇసుకను అక్రమంగా తరలించే ట్రాక్టరును పట్టుకుంటే కేసు నమోదు చేసి రూ.10 వేల జరిమానా విధించాలి. అయితే జిల్లాలోని చాలా ప్రాంతాల్లో అంతో.. ఇంతో తీసుకుని వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. రాత్రికి రాత్రే రేషన్ బియ్యం సరిహద్దు దాటుతోంది. యథేచ్ఛగా కర్ణాటక మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. గంజాయి అమ్మకాలు కూడా సాగుతున్నాయి. పుట్టపర్తి, ధర్మవరం, చెన్నేకొత్తపల్లి, పెనుకొండ, చిలమత్తూరు, హిందూపురం ప్రాంతాల్లో భారీ దందా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లోని పోలీసులపై ప్రజాప్రతినిధుల తరపు మనుషులు కట్టడి చేస్తున్నారు. దీంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారు.

చర్యలు తప్పవు




అక్రమాలను ఉపేక్షించేది లేదు. కర్ణాటక మద్యం, రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి తనిఖీ చేయిస్తున్నాం. ఎక్కడికక్కడ పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. అవినీతి, అక్రమాలకు చోటు ఉండదు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు.

– వి.రత్న, ఎస్పీ

'తమ్ముళ్ల' కనుసన్నల్లోనే దందా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జిల్లాలో ఇసుక అక్రమ రవాణా, కర్ణాటక మద్యం విక్రయాలు, గంజాయి అమ్మకాలు, రేషన్ బియ్యం తరలింపు విపరీతంగా పెరిగిపోయాయి. పర్యవేక్షణ కరువు కావడంతో అక్రమార్కులు రాజ్యమేలుతున్నారు. ప్రజలే పక్కాగా సమాచారం ఇచ్చినా ... పోలీసులు పట్టుకోవడం లేదు. ఒకవేళ ఎవరైనా పట్టుకున్నా వెంటనే టీడీపీ ప్రజాప్రతినిధుల నుంచి ఫోన్లు వస్తున్నాయి. దీంతో ఈ తలనొప్పి తమకెందుకని పోలీసులు చేష్టలుడిగి చూస్తున్నారు. దీంతో టీడీపీకి చెందిన చాలామంది కార్యకర్తలు అక్రమ మార్గంలో అందినకాడికి దోచుకుంటున్నారు.



పుట్టపర్తి శివారులో గంజాయి సిద్ధం చేస్తున్న ఓ యువకుడు

పలువురు సీఐల బదిలీ

పుట్టపర్తి టౌన్: జిలాల్లో పనిచేస్తున్న పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల (సీఐ)ను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురంలో ట్రాఫిక్ సీఐ పనిచేస్తున్న నారాయణరెడ్డిని కదిరికి, నల్లమాడ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌ను కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్‌కు, అనంతపురం స్పెషల్ బ్రాంచ్‌లో ఉన్న ఎంపీ ఇంద్రాణీని కొత్తచెరువు యూపీఎస్‌కు, జనార్దన్‌ను హిందూపురం రూరల్ సర్కిల్‌కు, చిత్తూరు వీఆర్‌లో ఉన్న బి.ఎన్ సురేష్‌ను పుట్టపర్తి రూరల్ సర్కిల్‌కు, పుట్టపర్తి డీటీసీలో ఉన్న సీఐ సునీతను పుట్టపర్తి అర్బన్ సర్కిల్‌కు, అనంతపురం వీఆర్‌లో ఉన్న బి.శేఖర్‌ను గోరంట్ల యూపీఎస్‌కు, శ్రీసత్యసాయి జిల్లా సైబర్ క్రైమ్ సీఐగా ఉన్న హేమంత్‌కుమార్‌ను ఇటుకులపల్లి సర్కిల్‌కు, డీసీఆర్‌బీ సీఐ శ్రీహర్షను రాప్తాడు సర్కిల్‌కు బదిలీ చేశారు. అలాగే కదిరి సీఐ పుల్లయ్య, గోరంట్ల సీఐ సుబ్బరాయుడు, పుట్టపర్తి రూరల్, అర్బన్ సీఐలు రాగిరి రామయ్య, టీ.వి కొండారెడ్డి, కొత్తచెరువు యుపీఎస్ సీఐ రాజా రమేష్‌ను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

15లోపు అనుమతులు పొందాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: ఉపాధి హామీ పథకం ద్వారా ఆయా శాఖల పరిధిలో చేపట్టనున్న పనుల కోసం అధికారులు ఆగస్టు 15వ తేదీలోపు అనుమతులు పొందాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. అలాగే ఇప్పటికే మంజూరైన అనుమతులను త్వరగా పూర్తి చేయాలన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇక నుంచి ప్రతి వారం సమావేశం జరుగుతుందని, ఆయా శాఖల అధికారులు మండలాల వారీగా నివేదికలు తెప్పించుకొని సిద్ధం చేసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. పట్టు పరిశ్రమ శాఖకు మంజూరైన 57 పనులను త్వరగా గ్రౌండింగ్ చేయాలన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల షెడ్లు, మేకల షెడ్లు నిర్మించేందుకు లబ్ధిదారులను గుర్తించాలన్నారు. గ్రామ సభల్లో పనుల గురించి తెలిపి సభ్యుల ఆమోదంతోనే ప్రతిపాదనలు పంపాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ విజయప్రసాద్, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పద్మమ్మ, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డీపీఓ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, పీఆర్ ఎస్ఈ మురళీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రామాంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న కలెక్టర్ చేతన్, వడిత్యా శంకర్ నాయక్, తదితరులు

- ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ చేతన్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్‌నాయక్, ఆర్డీఓ భాగ్యరేఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్‌రాం తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో 84 వేల మంది ఎస్టీలు ఉన్నారని, వారందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామన్నారు. ఆదివాసీల్లో సికిల్‌సెల్ ఎనీమియాను నిర్మూలించడానికి 40 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారికి కేంద్ర ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఎస్టీలందరికీ ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలను అందించడానికి స్పెషల్ డ్రైవ్ చేపడతామన్నారు. వసతి గృహాల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. జిల్లా కేంద్రంలో బంజారా భవన్ నిర్మాణానికి స్థల సేకరణ చేపడతామన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పగడ్బందీగా అమలయ్యేలా చూస్తామన్నారు. శ్మశాన వాటికల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఆగస్టు 15న గిరిజన సంప్రదాయాలు ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఏకలవ్యుడు, బంజారాలాల్ విగ్రహాలు ఏర్పాటు చేయాలి..

రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్ నాయక్ మాట్లాడుతూ, పుట్టపర్తిలో ఏకలవ్యుడు, బంజారాలాల్ విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. కమిషన్ తరఫున ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నామన్నారు. విద్య, వైద్య రంగాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే ఆదివాసీ దినోత్సవ లక్ష్యమన్నారు. కార్యక్రమం అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణానాయక్, ఆనందనాయక్, కాలేనాయక్, అజయ్ నాయక్, రవి నాయక్, వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిలా మారిన కలెక్టర్ చేతన్

నల్లమాడ: కలెక్టర్ చేతన్ కొద్దిసేపు ఉపాధ్యాయుడిగా మారారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన నల్లమాడలోని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధ్యాయుడిలా మారి పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అదేవిధంగా ఏడో తరగతిలో ఆరోహణ క్రమము, స్టాటిస్టిక్స్ గురించి కలెక్టర్ బోధించారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఎందుకు జరుపుకుంటారు, ఆదివాసీ దినోత్సవం ప్రాముఖ్యత ఏమిటి అన్న విషయాలను విద్యార్థులతోనే చెప్పించారు. అనంతరం కలెక్టర్ నేరుగా వంట గదికి వెళ్లి కూరగాయలు, సరుకులను పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఈఓ మీనాక్షి, తహసీల్దార్ రంగనాయకులు, ఎంఈఓలు వేమనారాయణ, సురేష్‌బాబు ఉన్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ చేతన్

ముస్లింల ద్రోహి టీడీపీ

- వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతివ్వడంపై భగ్గుమన్న ముస్లింలు
- బిల్లును వ్యతిరేకించి అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీకి కృతజ్ఞతలు



ముస్లింలపై రుబాబు

చంద్రబాబు ముసుగు తొలగింది. ముస్లింలకు అండగా ఉంటానన్న ఆయన మాటలు నీటిపై రాతలేనని పార్లమెంట్ సాక్షిగా రుజువైంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు ఏకపక్షంగా మద్దతివ్వడంతో బాబు నిజస్వరూపం బట్టబయలైంది. పదేళ్లుగా లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీతో జత కూడినప్పుడే బాబు తీరుపై ముస్లింలలో అనుమానం కలిగింది. తాజాగా వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం తెలపడంతో ఆ అనుమానం నిజమైంది. బాబు కూడా ఆ తాను ముక్కేనని.. తాను నడిచేది ఆ'కాషాయ' ఛాయల్లోనేనని తెలిసిపోయింది.

సాక్షి, పుట్టపర్తి: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ ఏకపక్షంగా మద్దతు ఇవ్వడంపై ముస్లింలు భగ్గుమంటున్నారు. ముస్లింలకు తోడుగా ఉంటానంటూనే మోదీకి తోడై .. తొడేళ్ల పన్నాగం పన్నుతావా అంటూ ధ్వజమెత్తుతున్నారు. వక్ఫ్ ఆస్తులకు రక్షణగా ఉంటామంటూనే 'ఉఫ్'మని లాగేసేందుకు నక్కజిత్తుల ఎత్తులేస్తున్నావా అంటూ మండిపడుతున్నారు. మరోవైపు పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లును వైఎస్సార్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకించడంతో ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్ ఎప్పుడూ ముస్లింల పక్షపాతేనని కొనియాడుతున్నారు. వక్ఫ్ సవరణ బిల్లును పూర్తిగా ఆపేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. మైనార్టీలకు ఏ కష్టమొచ్చినా.. ఏ నష్టం జరిగినా అండగా ఉంటామంటూ చెప్పిన టీడీపీ, జనసేన పార్టీలు ఇప్పుడెలా మద్దతిస్తాయని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడైనా రెండు నాల్కల ధోరణిని మానుకోవాలని హితవు పలుకుతున్నారు.

మత స్వేచ్ఛకు భంగం



వక్ఫ్ బిల్లును సవరిస్తే మత స్వేచ్ఛకు భంగం కలుగుతుంది. వక్ఫ్ ఆస్తులు మతపరమైన కార్యక్రమాల నిర్వహణ కోసమే ఉన్నాయి. అలాంటి వాటిపై రాజకీయం చేయడం సరికాదు. కానీ బీజేపీ ఇందుకు పూనుకుంది. ఆ పార్టీకి పార్లమెంట్‌లో టీడీపీ మద్దతుగా నిలిచింది. దీన్నిబట్టి చూస్తే ముస్లిం సంక్షేమంపై చంద్రబాబు చిత్తశుద్ధి తెలుస్తోంది.

– అసిఫ్, హిందూపురం

బీజేపీ రాజకీయ వ్యాపారం



ఓ మతాన్ని లక్ష్యంగా చేసుకుని బిల్లులు సవరించడం సరికాదు. మహారాష్ట్ర, హరియాణ ఎన్నికల కోసం బీజేపీ రాజకీయ వ్యాపారం చేస్తోంది. ముస్లింలను శత్రువులుగా భావిస్తూ అణచివేసేందుకు సిద్ధమైంది. ఈ దుర్మార్గానికి టీడీపీ అధినేత చంద్రబాబూ సహకరించడం అన్యాయం. దేశంలోని ముస్లింలందరూ ఎన్‌డీఏ కూటమికి బుద్ధి చెబుతారు.

– సుబాన్‌బాషా, ధర్మవరం

చంద్రబాబు వైఖరి మారాలి



వక్ఫ్ సవరణ బిల్లును వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించడాన్ని స్వాగతిస్తున్నాం. అయితే బీజేపీకి తొత్తుగా మారిన చంద్రబాబు మద్దతు తెలపడం సరికాదు. ఇప్పటికైనా ఆయన వైఖరి మారాలి. లేకపోతే రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా.. టీడీపీకి ముస్లింలంతా తగిన విధంగా బుద్ధి చెబుతారు.

– రఫీ, పుట్టపర్తి

రాజకీయ కుట్రలో భాగమే



రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నట్లు అనుమానం కలుగుతోంది. రాజకీయ కోణంలో భాగంగానే వక్ఫ్ సవరణ బిల్లును తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకు టీడీపీ సహకరించడం దుర్మార్గం. ప్రజాస్వామ్య ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలో బోర్డు సభ్యులను ఎందుకు నామినేట్ చేస్తున్నారో అర్థం కావడం లేదు. ఏ మత సంస్థలోనూ ఇతరులు సభ్యులుగా ఉండరు. మరి ముస్లింలకు చెందిన కమిటీలో హిందువులకు చోటు ఇస్తామని చెప్పడం దారుణం.

– జాఫర్ వలి, బ్రాహ్మణపల్లి

ఇతరుల పెత్తనమేంటి ?



కేంద్ర ప్రభుత్వం ముస్లింలను అణచివేయాలని చూస్తోంది. ఇందుకోసం మా వక్ఫ్ బోర్డుకు సంబంధించిన ఆస్తులు, ఇతరత్రా వాటిపై పెత్తనం చేయాలని చూస్తోంది. ఇందుకోసం పార్లమెంట్‌లో బిల్లును సైతం ప్రవేశపెట్టింది. ఈ బిల్లుకు టీడీపీ మద్దతు ఇవ్వడం విచారకరం. కానీ బిల్లుకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ మద్దతు ఇవ్వడం సంతోషం. టీడీపీ అధినేత చంద్రబాబు ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరించడం తగదు.

– కరీంసాబ్, మాజీ ముతవల్లి, జామీయా, మదీనా మసీదు, బత్తలపల్లి

మనోభావాలను దెబ్బతీయడమే



వక్ఫ్ బోర్డులో సభ్యులుగా హిందువులను చేరుస్తామని చెప్పడం ముస్లిం మనోభావాలను దెబ్బ తీయడమే. వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 25కు విరుద్ధం. చాలా రాష్ట్రాల్లో వక్ఫ్ ఆస్తులు వేల ఎకరాలు ఉన్నాయి. వాటన్నింటికీ ముస్లింలే రక్షకులు. ఇలాంటి సున్నితమైన విషయంలో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయి. ఈ బిల్లును విపక్షాలు వ్యతిరేకించినా.. టీడీపీ మద్దతు తెలపడం చూస్తే ఆ పార్టీ ముస్లింలకు ఇచ్చే ప్రాధాన్యత ఏమిటో తెలుస్తోంది.

– ఇస్మాయిల్, కదిరి

ఆస్తుల స్వాధీనానికే సవరణ బిల్లు



ముస్లింల ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నింది. ముస్లిం, మైనార్టీలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడం... దానికి టీడీపీ వత్తాసు పలకడం హేయం వెంటనే ఆ బిల్లును రద్దు చేసి ముస్లిం, మైనార్టీల హక్కులను కాపాడాలి. లేకపోతే ఒక్క ముస్లిం కూడా ఆ కూటమి పార్టీల వైపు నడవరు.

– కె.బాబాఫక్రుద్దీన్, కో ఆప్షన్ సభ్యుడు, తాడిమర్రి

క్లుప్తంగా

చిరుత దాడిలో దూడ మృతి



పావగడ: తాలూకాలోని నిడుగల్ గ్రామంలోకి గురువారం రాత్రి ప్రవేశించిన ఓ చిరుత.. ఆవు దూడను తీవ్రంగా గాయపరిచి చంపేసింది. దీంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గురువారం రాత్రి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచి పోయిన సమయంలో చిరుత ప్రవేశించినట్లు స్థానికులు తెలిపారు.

ట్యాంకర్ కిందపడి చిన్నారి మృతి



జునైద్ (ఫైల్)

హిందూపురం అర్బన్: వాటర్ ట్యాంకర్ డ్రైవర్ అజాగ్రత్త కారణంగా ఓ చిన్నారి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కొట్నూరుకు చెందిన సైపుల్లా... రమేష్ అనే యజమాని ట్రాక్టర్ ట్యాంకర్‌కు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ట్యాంకర్‌లో నీటిని తీసుకెళ్లి పట్టణంలోని పలు కాలనీల్లో ప్రజలకు విక్రయించేవాడు. శుక్రవారం ఉదయం మోడల్‌కాలనీలో నీటిని సరఫరా చేసేందుకు వెళ్లిన సమయంలో పాత మసీదు వద్దకు చేరుకోగానే స్థానికుడు బాబ్జాన్ కుమారుడు జునైద్ (2) పొరబాటున రోడ్డుపైకి వచ్చాడు. చిన్నారిని గమనించకుండా సైపుల్లా ముందుకు వెళ్లిపోవడంతో ట్యాంకర్ చక్రాల కిందపడి జునైద్ మృతిచెందాడు. కళ్లెదుటే తమ కుమారుడు మృతి చెందడంతో జునైద్ తల్లిదండ్రులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదానికి కారణమైన సైపుల్లాకు డ్రైవింగ్ లైసెన్స్ లేదని నిర్ధారణ అయింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అమెరికాలో ఫెలోషిప్ సాధించిన 'పురం' యువకుడు



ఆరుశ్ ఉదయ్

హిందూపురం టౌన్: అమెరికాలోని జార్జియా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసే అవకాశాన్ని హిందూపురానికి చెందిన ఆరుశ్ ఉదయ్ దక్కించుకున్నాడు. బెంగళూరులోని జీకేవీకె విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ అగ్రికల్చర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఆయన... పీహెచ్‌డీని అమెరికాలో చేయాలని నిశ్చయించుకున్నాడు. ఈ క్రమంలో అమెరికాలోని జార్జియా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇటీవల నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశాల పోటీ పరీక్షల్లోనూ ప్రతిభ కనబరిచి ఫెలోషిప్ దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ... మొక్కల్లో వైరాలజీ గురించి ట్రిప్స్, మైట్స్ కీటకాల పాత్రపై పరిశోధన చేయనున్నట్లు తెలిపారు.

రాజ్యోన్మాదంపై ప్రజాగ్రహం

- అంబేడ్కర్ విగ్రహంపై పచ్చమూకల చీకటిదాడిని ఖండించిన యావత్ ప్రజానీకం
- దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



సాక్షి నెట్‌వర్క్ : విజయవాడ నడిబొడ్డున అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై గురువారం రాత్రి పచ్చమూకల చీకటిదాడిని ప్రజాసంఘాల నేతలు, ప్రజలు ముక్తకంఠంతో ఖండించారు. రాజ్యోన్మాదం కారణంగా ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందంటూ మండిపడ్డారు. ప్రభుత్వమే పూనుకుని రాజ్యాంగ నిర్మాతపై దాడికి ప్రేరేపించడం దేశచరిత్రలోనే కనీవినీ ఎరుగని దారుణమని పేర్కొన్నారు.

దళిత జాతిని అగౌరవపరిచారు



విజయవాడలో అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం అమానుషం. ఇది యావత్ దళిత జాతిని అగౌరవ పరచడమే. అంబేడ్కర్ ఆశయ సాధనలో భాగంగా మాజీ సీఎం వైఎస్ జగన్ ఆ మహానుభావుడి మహాశిల్పాన్ని విజయవాడ నడిబొడ్డులో ఏర్పాటు చేశారు. ఇంతటి అపూర్వమైన శిల్పాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలి.

–రంగనాయకులు, దళిత సంఘం నాయకుడు, పి.కొండాపురం, పామిడి మండలం

దిగజారుడు రాజకీయాలు



అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడి టీడీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. ఇచ్చిన హామీలు తుంగలోకి తొక్కి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన భవనాలు, విగ్రహాలను పగులగొట్టడం వంటి పనులు చేస్తూ నీచ రాజకీయాలు చేస్తున్నారు. టీడీపీ నాయకులు త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

– నీలం భాస్కర్, జెడ్పీటీసీ సభ్యుడు, బుక్కరాయసముద్రం

ప్రజాస్వామ్యంలో ఉన్నామా?



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం వెనుక ఎంతటివారున్నా కఠినంగా శిక్షించాలి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక విగ్రహాలు, మనుషులపై దమనకాండ ఎక్కువైంది. అసలు ప్రజాస్వామ్యంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోంది. విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఉన్మాదులను తక్షణం అరెస్టు చేసి జైలుకు పంపాలి. ఈ ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని స్పందించాలి.

– శారద, 19వ వార్డు కౌన్సిలర్, రాయదుర్గం

ఎల్లో గ్యాంగ్‌ను కఠినంగా శిక్షించాలి



విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం హేయమైన చర్య. ఈ ఘటనతో యావత్ దళిత సమాజం నివ్వెరపోయింది. సాక్షాత్తూ రాజ్యాంగ నిర్మాత విగ్రహంపై పచ్చమూకలు దాడి చేయడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ. దళిత జాతికి అవమానకరం. ఈ ఘటనపై రాష్ట్రపతి స్పందించాలి. ఈ దుశ్చర్యకు కారకులైన ఎల్లో గ్యాంగ్‌ను గుర్తించి కఠినంగా శిక్షించాలి. లేకుంటే దళిత జాతి ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుంది.

– బీటీపీ గోవిందు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, రాయదుర్గం

టీడీపీ అరాచకాలు పెచ్చుమీరాయి



టీడీపీ నేతృత్వంలో కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు పెచ్చుమీరాయి. రాజ్యాంగ నిర్మాతను అవమానపరిచేలా, దళిత, గిరిజన, బహుజనుల మనోభావాలను దెబ్బతీసేలా విజయవాడలో అంబేడ్కర్ విగ్రహంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. దాడి చేసిన వారిని గుర్తించి.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి. ఈ ఘటనకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సమాధానం చెప్పాలి.

–సాకే గంగాధర్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి

దళిత జాతికే అవమానం



అంబేడ్కర్ విగ్రహంపై దాడి దళిత జాతికే అవమానం. ఎన్నడూ లేని విధంగా విగ్రహాలపై దాడులు చేయడం సిగ్గుచేటు. అధికారుల సమక్షంలోనే ఇలాంటి చర్యలకు పూనుకోవడం హేయమైన చర్య. పోలీసులు ఉన్నా ప్రేక్షక పాత్ర పోషించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

– చెలిమప్ప, ఎస్సీ,ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు, కళ్యాణదుర్గం


రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది



విజయవాడలో అంబేడ్కర్ విగ్రహంపై దాడి టీడీపీ కార్యకర్తల పనే. సీఎం చంద్రబాబుకు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంపై ఏమాత్రమూ నమ్మకం లేదనే విషయం ఈ దుశ్చర్యతో బయట పడింది. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ.. ఇలాంటి ఘటనలను ప్రోత్సహిస్తున్నారు.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

నీచమైన చర్య



రాష్ట్రంలో నీచమైన సంస్కృతికి కూటమి ప్రభుత్వం తెర తీస్తోంది. విజయవాడ నడిబొడ్డున గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహాశిల్పంపై దాడికి పాల్పడిన టీడీపీ మూకలను కఠినంగా శిక్షించాలి.

–టైలర్ వన్నూరుస్వామి, ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి.. ప్రభుత్వం చొరవ తీసుకోవాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డా.గేయానంద్

పుట్టపర్తి టౌన్: విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ 6వ ప్లీనరీ సమావేశం శుక్రవారం కొత్తచెరువులో ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు సాగిన ఈ సమావేశాలకు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంతకు ముందు వందలాది మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో ముఖ్య వక్తలు మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయల కల్పన, నియోజకవర్గ కేంద్రాల్లో ఐటీఐ, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు తదితర డిమాండ్ల సాధనకు ఉద్యమ కార్యాచరణను రూపొందించి ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, బాబ్జాన్, పవన్‌కుమార్, సహాయకార్యదర్శి చంద్రశేఖర్, హర్షకుమార్, హరి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య



మారుతి (ఫైల్)

సోమందేపల్లి: అప్పులు బాధ తాళలేక ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... సోమందేపల్లిలోని స్నేహలత నగర్‌కు చెందిన మారుతి (36)కి భార్య శశికళ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానికంగా చేతి మగ్గంపై చీరలు నేస్తూ జీవనం సాగించేవాడు. కొన్ని నెలలుగా మగ్గం పని లేకపోవడంతో కుటుంబ పోషణ, ఇతర అవసరాలకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. సకాలంలో అప్పులు చెల్లించకపోవడంతో వడ్డీల భారం పెరిగి రూ.3 లక్షలకు చేరుకుంది. ఈ నేపథ్యంలో అప్పు చెల్లించాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు మొదలయ్యాయి. ఒక వైపు పనులు లేకపోవడం... మరో వైపు వడ్డీ వ్యాపారుల వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో జీవితంపై విరక్తి చెందిన మారుతి శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య శశికళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

నల్లమాడ: విజయవాడలో గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకం ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం నల్లమాడలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. విజయవాడ నడిబొడ్డున వైఎస్ జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని చూసి ఓర్వలేక టీడీపీ గూండాలు ఈ దారుణానికి ఒడిగట్టాయని మండిపడ్డారు. నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సూర్యనారాయణ, ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పారకల రమణ, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు ఆసాది ఆదినారాయణ, సర్పంచ్‌లు ప్రసాద్, బొజ్జేనాయక్, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, గోవిందరెడ్డి, కమలాకర్‌నాయుడు, రామకృష్ణారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, మోదీనమ్మ, మంగేనాయక్, రవి, ప్రతాప్‌నాయక్, సుధాకర, హైదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

లారీల్లో తరలించాల్సిన సరుకు బస్సుల్లో!

- రవాణాశాఖ అధికారుల తనిఖీల్లో వెలుగులోకి
- మూడు కేసుల నమోదు



కొడికొండ చెక్‌పోస్టులో తనిఖీలు చేపట్టిన రవాణాశాఖ అధికారులు

హిందూపురం అర్బన్: ఓ రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి కేవలం లారీల్లోనే తరలించాల్సిన సరుకులు బస్సుల్లో వెళుతున్నాయి. ఇందులో అత్యంత విలువైన సరుకులు ఉన్నట్లు సమాచారం అందుకున్న రవాణా శాఖ అధికారులు వెంటనే స్పందించారు. గురువారం రాత్రి కొడికొండ చెక్‌పోస్టులో ఎంవీఐలు శివశంకర్, జయశ్రీ యాదవ్, ఉదయ్ కుమార్ తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణికులతో పాటు సరుకు రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. మరికొన్ని బస్సుల్లో పూర్తి స్థాయిలో సరుకు మాత్రమే తరలిస్తుండడంతో మూడు ప్రైవేట్ బస్సుల యాజమాన్యంపై కేసులు నమోదు చేశారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం



ఎస్పీ రత్న చేతుల మీదుగా హోంగార్డుగా నియామక ఉత్తర్వులు అందుకుంటున్న ఉదయ

పుట్టపర్తి టౌన్: ప్రమాదంలో మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎస్పీ రత్న భరోసానిచ్చారు. ఆరు నెలల క్రితం డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళుతూ ప్రమాదంలో మరణించిన హోంగార్డు నాగప్ప భార్య ఉదయకు శుక్రవారం కారుణ్య నియామకం కింద హోంగార్డ్‌గా నియామక ఉత్తర్వులను ఎస్పీ అందజేసి, మాట్లాడారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్‌ఐ వలి, ఏఆర్ ఎస్‌ఐ శ్రీరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి ..


జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ విష్ణు భరోసానిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు. బదిలీలు, సస్పెన్స్ రీవోక్, సరెండర్ లీవ్ తదితర సమస్యలపై 27 వినతులను బాధితులు అందజేశారు. వినతులను ఏఎస్పీ విష్ణు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. న్యాయపరమైన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

అనుమతి రాగానే అదనపు సీట్ల భర్తీ

- సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అదనపు సీట్లకు అనుమతి రాగానే భర్తీ చేస్తామని కో–ఆర్డినేటర్ అంగడి మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గురుకులాలకు ఉన్న ప్రాధాన్యత, డిమాండ్ దృష్ట్యా రెండు జిల్లాల కలెక్టర్ల చొరవతో గురుకులాల్లో తరగతి గదులు, డార్మిటరీ సౌకర్యాలు ఉండే చోట 5 నుంచి 8 తరగతుల్లో ఒక్కో తరగతికి 10 సీట్లు పెంచేలా సెక్రటరీకి లేఖ రాశామన్నారు. అనుమతి వచ్చిన వెంటనే వాటికి కూడా ప్రవేశ పరీక్ష ద్వారానే మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తామన్నారు. మూడు కౌన్సిలింగ్‌ల తర్వాత కూడా మిగిలి ఉన్న సీట్లను కలెక్టర్ అనుమతితోనే భర్తీ చేసినట్లు స్పష్టం చేశారు. సీట్ల భర్తీలో ఏదైనా అవకతవకలు జరిగాయని భావిస్తే రుజువులతో నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. తప్పుడు ప్రచారాలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పలువురు ఎస్‌ఐల బదిలీ



సాక్షి, పుట్టపర్తి: జిల్లాలోని పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ డీఐజీ కార్యాలయం నుంచి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీ అయిన ఎస్‌ఐలు (సివిల్)లు నిర్దేశించిన స్థానాల్లో వెంటనే చేరాలని ఆదేశించారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
బి.మల్లికార్జునరెడ్డి	కనగానపల్లి	ఓడీ చెరువు
ఎన్.వంశీకృష్ణ	ఓడీ చెరువు	వీఆర్, పుట్టపర్తి
కె.శ్రీదర్	ఎన్‌పీకుంట	హిందూపురం వన్‌టౌన్
ఎస్.మున్వర్‌అహ్మద్	ఆత్మకూరు	చిలమత్తూరు
వి.గంగాధర్	చిలమత్తూరు	వీఆర్, పుట్టపర్తి
రంగడుయాదవ్	కియా	పరిగి
ఎస్.సత్యనారాయణ	పరిగి	వీఆర్, పుట్టపర్తి
జి.రమేశ్‌బాబు	నల్లమాడ	సోమందేపల్లి
వై.విజయ్‌కుమార్	సోమందేపల్లి	వీఆర్, పుట్టపర్తి
ఎం.రాజేష్	పెనుకొండ	కియా
కె.ఎం లింగన్న	నల్లచెరువు	పుట్టపర్తి రూరల్
పి.కృష్ణమూర్తి	పుట్టపర్తి రూరల్	బుక్కపట్నం
ఎ.వెంకటనారాయణ	వీఆర్, పుట్టపర్తి	అమడగూరు
సీటీ మక్బుల్‌బాషా	అమడగూరు	వీఆర్, పుట్టపర్తి

విద్యుత్ ఉద్యోగుల క్రీడాపోటీల్లో అనంత విజేత



విజేత ట్రోఫీని అందుకుంటున్న అనంతపురం జట్టు సభ్యులు

అనంతపురం టౌన్: విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. నంద్యాల జిల్లా సున్నిపెంటలో వారం రోజులుగా క్రీడా పోటీలు జరిగాయి. శుక్రవారం సాయంత్రం జరిగిన బాల్ బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో కర్నూలు జిల్లాతో తలపడి విజేత ట్రోఫీని అనంత క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా జట్టు కెప్టెన్ ప్రభాకర్, వెంకటనారాయణ, శివకుమార్, అనిల్, బాబా, రవి, పవన్‌ను ఆ శాఖ ఉన్నతాధికారులు అభినందించారు.

రోడ్డుపై కూలిన భారీ వృక్షం



ఆమిదాలగొందిలో రోడ్డుకు అడ్డంగా కూలిన వృక్షం

మడకశిర రూరల్: మండలంలోని ఆమిదాలగొందిలో అశ్వత్థ కట్టపై వెలసిన భారీ వృక్షం (రాగి మాను) శుక్రవారం ఉన్నఫళంగా రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. విద్యుత్ స్తంభం సైతం నేలవాలింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కూలిన రావి వృక్షానికి దాదాపు 100 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్నట్లు స్థానికులు తెలిపారు. కూలిన వృక్షాన్ని తొలగించడం ఆలస్యం కావడంతో కర్ణాటక బస్సులు, ఇతర వాహనాలను మడకశిర మీదుగా దారి మళ్లించారు.

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంపై దాడి



ధ్వంసమైన రైలింగ్ కడ్డీలను పరిశీలిస్తున్న డాక్టర్ ఘనేనాయక్, తదితరులు

నల్లమాడ: మండలంలోని యర్రవంకపల్లి వద్ద నూతనంగా నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య (భారత్ నిర్మాణ్ సేవా) కేంద్రంపై గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. తాళం, స్టీల్ రైలింగ్ పైపులను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ రజనీకాంత్‌రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ ఘనేనాయక్, సచివాలయ కార్యదర్శి సందీప్, డీలర్ ప్రసాద్‌రెడ్డి, సీహెచ్‌ఓ రామాంజులు, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్ర, ఆరోగ్య సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. గ్రామానికి కిలోమీటర్ దూరంలో ప్రధాన రహదారి పక్కన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించింది. ఇవన్నీ ముమ్మాటికీ ప్రభుత్వ భవనాలే అయినా... కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పలు ప్రాంతాల్లో టీడీపీ నాయకులు ధ్వంసం చేస్తూ వచ్చారు. ఈ విధ్వంసంపై చంద్రబాబు సర్కార్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో దుండగులు మరింత రెచ్చిపోయారు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి యర్రవంకపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంపై విరుచుకుపడ్డారు. కాగా, ఈ దుశ్చర్యపై ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ఘనేనాయక్ తెలిపారు.

34 మంది ఎంపీడీఓల రిలీవ్

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 34 మంది ఎంపీడీఓలు శుక్రవారం రాత్రి 9 గంటలకు రిలీవ్ అయ్యారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరిగి సొంత జిల్లాలకు బదిలీపై వెళ్లారు.